క్లుప్తంగా

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



ప్రభుత్వ విప్ శంబీపూర్‌రాజును సత్కరించిన దృశ్యం..

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అన్నారు. శనివారం ఆయన భౌరంపేట్‌లో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం భవనాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శంబీపూర్ రాజు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వదులుతున్నామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



సుభాష్‌నగర్: షాపూర్‌నగర్ ఎస్ఎల్‌బి నగర్‌లోని గంగభవానీ, మాధవరావు దంపతుల నివాసంలో శనివారం బ్రహ్మకమలం వికసించింది. సంవత్సరానికి ఒకసారి వికసించే ఈ పుష్పాన్ని చూడడానికి చుట్టుపక్కల ఇళ్లవాసులు క్యూ కట్టారు.

ఆక్రమణలు కూల్చివేసిన అధికారులు



సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలపై కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు మరోసారి కొరడా ఝుళిపించారు. తహసిల్దార్ అబ్దుల్ రెహమాన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక నేతృత్వంలో శనివారం జగద్గిరిగుట్ట, గాజులరామారంలోని నాలుగు చోట్ల కూల్చివేతలు చేపట్టారు. దేవేందర్ నగర్‌లో 7 గదులు, 5 బేస్‌మెంట్లు, జగద్గిరిగుట్టలో ఒక బేస్‌మెంట్‌ను తొలగించారు. కూల్చివేతల సమయంలో స్థానికంగా కొందరు గది నిర్మిస్తుండగా అధికారులను చూసి పరారయ్యారు.

ఛాన్స్ ఎవరికో?



- మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు
- గతంతో పోలిస్తే ఈసారి రెట్టింపు దరఖాస్తులు
- ఎక్సైజ్ శాఖకు రూ.15.38 కోట్ల ఆదాయం
- 21న డ్రా పద్ధతిలో ఎంపిక

కుత్బుల్లాపూర్: మద్యం దుకాణాలకు దరఖాస్తుదారులు క్యూ కట్టారు. గత సంవత్సరం కంటే ఈసారి దరఖాస్తులు రెట్టింపయ్యాయి. మేడ్చల్ ఎక్సైజ్ సూపరిడెంట్ పరిధిలో బాలానగర్, కుత్బుల్లాపూర్, మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో మొత్తం 114 మద్యం దుకాణాలకు టెండర్లను ఈ నెల 4వ తేదీ నుండి 18వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ అధ్వర్యంలో 17 మద్యం దుకాణాలను (గౌడ్స్, ఎస్సీ, ఎస్టీ) వివిధ కేటగిరీల వారీగా ఎంపిక చేశారు. 11 రోజులపాటు మందకొడిగా సాగిన దరఖాస్తుల స్వీకరణ 17, 18 తేదీల్లో చివరి రెండు రోజులు అనూహ్యంగా గత సంవత్సరం 2021–23 లో 3609 రాగా తాజాగా 2023 –25 శుక్రవారం రాత్రి వరకు 7519 రావడం విశేషం. గడిచిన రెండేళ్ల కంటే దరఖాస్తులు 3910 ఎక్కువ రావడంతో ఎక్సైజ్ అధికారులు అవాక్కయ్యారు..

13 రోజుల్లో రూ.15.38 కోట్లు...

మేడ్చల్ ఎక్సైజ్ సూపర్డెంట్ పరిధిలో మొత్తం 114 మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానించగా గడిచిన 13 రోజుల్లో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఏకంగా రూ 2. లక్షల చొప్పున 7519 దరఖాస్తులకు గాను 15.38 కోట్ల రూపాయలు దరఖాస్తుల రూపంలో ఆదాయం చేకూరింది. ఎక్కడా మద్యం సిండికేట్ లకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించామని ఈ నేపథ్యంలో గతంలో కంటే ఈ సంవత్సరం డబుల్ ఫిగర్ దాటామని మేడ్చల్ ఎక్సైజ్ సూపరిడెంట్ విజయ్ భాస్కర్ ×సాక్షికి తెలిపారు.

ఈ నెల 21వ తేదీన డ్రా

బాలానగర్, కుత్బుల్లాపూర్, మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ఈనెల 18 తో ముగియడంతో ఈనెల 21వ తేదీ మేడ్చల్ జిల్లా నాగోల్ ప్రాంతంలోని బండ్లగూడ లో ఉన్న అనంతుల రాంరెడ్డి గార్డెన్‌లో లక్కీ డ్రా నిర్వహించనుంది. పోటీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో డ్రా లో ఎవరు విజేత అన్నది దరఖాస్తుదారుల్లో తీవ్ర ఉత్కంఠతను రేపుతుంది.

ఆయా ప్రాంతాల్లో దరఖాస్తులు ఇలా...

- కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 44 మద్యం దుకాణాలకు గాను (నాలుగు గౌడ్స్, 2 ఎస్సీ, 1ఎస్సీ, 37 జనరల్ దుకాణాలకు) 3230 దరఖాస్తులు వచ్చాయి.
- బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 40దుకాణాలకు (నాలుగు గౌడ్స్, 2 ఎస్సీ, 34 జనరల్) మొత్తం 2932 దరఖాస్తులు.
- మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 30 మద్యం దుకాణాలకు (మూడు గౌడ్స్, ఒకటి ఎస్సీ, 26జనరల్) 1357 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



5కే రన్‌ను ప్రారంబిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగమణి

కుత్బుల్లాపూర్: ప్రజాసామ్య మనుగడకు ఎన్నికలే మూలాధారమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఉప కమిషనర్ నాగమణి అన్నారు. శనివారం ఓటు హక్కు, ఎన్నికల నిర్వహణ విషయాలపై అవగాహన కల్పించేందుకు పలు పాఠశాలల విద్యార్థులతో 5 కే రన్ ను నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా నుండి ఐడీపీఎల్, ఆపై ఐడీపీఎల్ నుండి కుత్బుల్లాపూర్ సర్కిల్ వరకు రన్ కొనసాగింది. ఈ రన్‌లో బాలానగర్ ఏసీపీ గంగారామ్, పేట్‌బషీరాబాద్, జీడిమెట్ల, దుండిగల్, సూరారం, జగద్గిరిగుట్ట సీఐలు, ఎన్నికల సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌లో రక్తదాన శిబిరం



ప్రగతినగర్‌లో రక్తదాన శిబిరానికి హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: రక్తదానంతో పలువురి ప్రాణాలు నిలిపిన వారమవుతామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సినీ హీరో చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివార నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో చిరంజీవి యువత ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, చిరంజీవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రసాద్, భాస్కర్‌రావు, వెంకట్‌రావు, రాంబాబు, ఆకుల చంటి, పవన్, చిన్న, వీరబాబు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



దుండిగల్: బౌరంపేటలోని శ్రీ భ్రమరాంబికా సమేత శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద ఆదివారం శ్రీచక్ర సహిత ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత రెండు రోజులుగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం చివరి రోజున ఉదయం 4 గంటలకు అమ్మ, స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకం నుంచి పూజ మొదలవుతుంది, ప్రత్యేక అలంకరణ, విశేష అర్చన, గణపతి పూజ, పుణ్యాహవాచన గర్తనాస్యమ్, రత్ననాస్యమ్ ధాతునాస్యమ్, భిజనాస్యమ్‌లతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్టాపన, ఇతర కార్యక్రమాలు ఉంటాయని, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కాసానికి పలువురి జన్మదిన శుభాకాంక్షలు



గజమాలతో కాసానిని సత్కరిస్తున్న అభిమానులు



నిజాంపేట్: తెలంగాణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ 69వ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ నాయకలు, కార్యకర్తలు, ముదిరాజ్ సంఘం నాయకులు, ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనారిటీ వర్గాల నేతలు పెద్ద సంఖ్యలో కాసానికి జన్మదిన శుభకాంక్షలు తెలియజేసేందుకు తరలివచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్‌తో పాటు వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం సాధ్యం



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌కు మద్దతు తెలుపుతున్న ఆర్పీఐ నాయకులు

కుత్బుల్లాపూర్: బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. రిపబ్లిక్ పార్టీ అఫ్ ఇండియా (ఆర్పీఐ) కుత్బుల్లాపూర్ శాఖకు చెందిన నాయకులు శనివారం శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతును తెలియజేశారు. జాతీయ స్థాయిలో రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా పార్టీ ఎన్డీఏలో భాగస్వామ్య పక్షమైన నేపథ్యంలో బీజేపీకి మద్దతును తెలుపుతున్నట్లు ఆ పార్టీ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు బాన్సోడ్ సాంబ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించి, వారి అభ్యున్నతికి పాటుపడే పార్టీ కేవలం బీజేపీ యేనని అన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షులు కంది శ్రీరాములు, రాజేశ్వర్ రావు, పత్తి సతీష్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత ఒక ప్రకటనలో తెలియజేశారు. తెలుగు, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, చరిత్ర, కామర్స్, బాటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ తదితర సబ్జెక్ట్‌ల బోధనకు పీజీలో 55 శాతంతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, సెట్ అర్హత సాధించిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఔత్సాహకులు ఆగస్టు 21వ తేదీ లోగా బహదూర్‌పల్లి దాక్ బంగ్లా సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, ఈ నెల 22న అభ్యర్థులకు కళాశాల ఆవరణలో ఇంటర్వ్యూలు ఉంటాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

కష్టపడి పని చేసే వారికి గుర్తింపు



అరుణ్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి ఎలప్పుడూ గుర్తింపు ఉంటుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మాదారెడ్డి అరుణ్‌రెడ్డిని నియమిస్తు రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు భూపతిరెడ్డి శనివారం భౌరంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అరుణ్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఇరుగు రాధాకృష్ణ, గడ్డమీది భరత్‌గౌడ్ పాల్గొన్నారు.

భవనంపైనుంచి పడి వ్యక్తికి గాయాలు

సుభాష్‌నగర్: ఏసీని రిపేరు చేస్తున్న క్రమంలో రెండవ అంతస్తు నుంచి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. జీడిమెట్ల డివిజన్ అంగడిపేటలోని కాస్ హోటల్‌ను ఆనుకుని ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఏసీని బోయిన్‌పల్లికి చెందిన ప్రవీణ్ శనివారం రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుండి పడిపోయాడు. దీంతో అతని ఎడమ కాలు, కుడి చేయి విరిగిపోయింది. బ్యాంకు సిబ్బంది అతన్ని దగ్గరలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

నిప్పంటించుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కుత్బుల్లాపూర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించాడు.ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. దేవరయాంజాల్ మల్లన్న బస్తీకి చెందిన రమేష్(34)కుటుంబంతో నివసిస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. భార్యాభర్తల మధ్య గత సంవత్సర కాలంగా తరచూ చిన్నపాటి గొడవలు జరుగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో భార్య పలుమార్లు చెప్పాపెట్టకుండా వెళ్లిపోవడం, కొద్ది రోజుల తరువాత ఇంటికి రావడం చేస్తూ వస్తోంది. ఈ నెల 17న బంధువు మృతి చెందడంతో రమేష్ సిద్దిపేటకు వెళ్లి అదే రోజు రాత్రి 7 గంటలకు ఇంటికి రాగా భార్యా పిల్లలు కనిపించలేదు. దీంతో ఆమె మొబైల్‌కు ప్రయత్నించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తీవ్ర మనస్తాపానికి గురైన రమేష్ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన అతని సోదరుడు వెంటనే మంటలను ఆర్పి గాయపడిన రమేష్‌ను స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో చేర్పించాడు. తరచూ ఇంటి నుండి వెళ్లిపోయి తన పరువు తీస్తున్న భార్య ప్రవర్తన నచ్చకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని,అన్ని వేళలా అందుబాటులో ఉంటానని,మీ కాలనీ, బస్తీల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కీసర: ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కీసర ఆర్డీవో రాజేష్‌కుమార్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' కార్యక్రమంలో భాగంగా కీసర అంబేడ్కర్ చౌరస్తా నుంచి కీసర ఔటర్ రింగ్ రోడ్డు వరకు నిర్వహించిన 5కే రన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకు ఓసారి జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోని మంచి నాయకుడిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ మేరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5కె రన్‌లో సీఐ వెంకటయ్య, తహసీల్దార్ అశోక్‌కుమార్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేసుకోండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లాలో పరిశ్రమలు, డ్రింకింగ్ వాటర్ ప్లాంట్స్, అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రుల్లో బోర్ బావులకు బిగించిన డిజిటల్ వాటర్ ఫ్లో మీటర్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో భూగర్భ జలాల వినియోగంపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని పర్మిషన్ లేని బోర్ బావులంటికి 30 రోజుల్లోగా రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి , జిల్లా కాలుష్య నియంత్రణ అధికారి, జిల్లా భూగర్భజల అధికారి ఆర్. దేవేంద్రప్రసాద్, మునిసిపల్ కమిషనర్లు , తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం

సాక్షి,మేడ్చల్ జిల్లా: ధూమపానం , పొగాకు ఉత్పత్తుల ద్వారా ఊపిరితిత్తుల కేన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలతో సహా ఆరోగ్యంపై అనేక రకాలుగా ప్రభావం పడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధూమపానం, పొగాకు ఉత్పత్తులు మానేయడం ద్వారా పలు ప్రమాదాలను గణనీయంగా తగ్గించుకుని, ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చునన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి

కుత్బుల్లాపూర్: ఓ మహిళ మెడలో చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. కొంపల్లి ఆంధ్ర బస్తీకి చెందిన అమరావతి శనివారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న ఇస్త్రీ దుకాణానికి నడుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ఎదురుగా నడుచుకుంటూ వచ్చిన ఓ వ్యక్తి ఆకస్మాత్తుగా ఆమె మెడలోంచి మూడు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకుని పరారయ్యాడు. సదరు మహిళ బిగ్గరగా అరవడంతో గమనించిన స్థానికులు సదరు వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కాగా స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తి స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడని, అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మురుగు.. పరుగు

- దుర్వాసనతో అవస్థలు
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



రాంరెడ్డినగర్‌లో రోడ్డుపై పారుతున్న మురగు

జీడిమెట్ల: గ్రేటర్ హైదరాబాద్‌లోనే అతిపెద్ద డివిజన్‌గా పేరుగాంచిన సుభాష్‌నగర్ ప్రజలు మురుగు సమస్యతో అవస్థలు పడుతున్నారు. సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్‌లోని కొన్ని రోడ్లలో ఎక్కడ చూసిన పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు కనిపిస్తున్నాయి. ప్రతిరోజూ కాలినడకన వెళ్లే ప్రజలు మురుగులో నుంచి నడవాల్సి వస్తోంది. మురుగు రోడ్లపై పారుతుండగా ఇళ్లల్లోకి తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు అంటున్నారు. దీనికి తోడు ఇళ్ల మధ్యలో ప్రధాన రోడ్లలో మురుగు పారుతుండటంతో పందులు గుంపులుగా తిరుగాడుతున్నాయని చెబుతున్నారు. మురుగు సమస్య నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని రాంరెడ్డినగర్ ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

◆ ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని సిబ్బంది..

మూడు సంవత్సరాలుగా రాంరెడ్డినరగ్‌లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కాలనీప్రజలు పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన దుర్వాసనతో దోమలు వృద్ధి చెంది కుడుతుండటంతో ప్రజలు జబ్బుల బారిన పడుతున్నారని స్థానికులు చెప్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని పట్టించుకుని మురుగునీటి సమస్యకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

◆ పాత డ్రైనేజీ వ్యవస్థతోనే ఇబ్బందులు..

కాలనీలో ఇప్పటికి పాత డ్రైనేజీ పైప్‌లైనే ఉంది. దీని సామార్థ్యం చిన్నగా ఉండటంతో పాటు డ్రైనేజీ నీరు పెరగడంతో పైప్‌లైన్ సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో మురగు భూగర్భ డ్రైనేజీ నుంచి బయటకు వస్తోంది.

డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచాలి..



4 సంవత్సరాలుగా రాంరెడ్డినగర్‌లో డ్రైనేజీ అవుట్‌లెట్‌లు మూసుకుపోయి ఉన్నాయి. దీంతో మురుగు మ్యాన్‌హోల్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపై పారుతోంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని భూగర్భ డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచాలని కోరుతున్నాం.

– ఎల్‌వీ రమణ, రాంరెడ్డినగర్